


మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని 2వ వార్డుకు నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారికి అందజేస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి బుద్ధి నవ్య



మూడుచింతలపల్లి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మల్కాజ్‌గిరి జోన్ డిసిపి శ్రీధర్, జవహర్‌నగర్ ఏసిపి చక్రపాణి, శామీర్‌పేట సిఐ శ్రీనాథ్



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త




తాండూరులో నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న అభ్యర్థి

# తొలి రోజే కోలాహలం

### జిల్లాలో 25 నామినేషన్లు స్వీకరణ
### వికారాబాద్-12, తాండూరు-11, పరిగి-2, కొడంగల్-నిల్

**వికారాబాద్, జనవరి 28, ప్రభాతవార్త :** జిల్లాలో పుర పోరులో నామినేషన్ల ప్రక్రియకు బుధవారం తెరలేచింది. తొలి రోజు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 25 నామినేషన్లు స్వీకరించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. వికారాబాద్ మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా, 11 మంది అభ్యర్థులు 12 నామినేషన్లు దాఖలు చేశారు. తాండూరు మున్సిపాలిటీలో 36 వార్డులుండగా, 11 మంది అభ్యర్థులు 11 నామినేషన్లు దాఖలు చేశారు. పరిగి మున్సిపాలిటీలో 18 వార్డులుండగా, ఇద్దరు అభ్యర్థులు 2 నామినేషన్లు దాఖలు చేశారు. కొడంగల్ మున్సిపాలిటీలో 12 వార్డులు ఉండగా, తొలి రోజు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేవని అధికారులు తెలిపారు. వికారాబాద్ మున్సిపాలిటీలోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సందర్శించి పరిశీలించారు.

**రంగారెడ్డిలో 40నామినేషన్లు**

**రంగారెడ్డి అర్బన్, జనవరి 28, ప్రభాతవార్త:** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి రంగారెడ్డి జిల్లాలో నామినేషన్ల దాఖలు ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఆరు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 126 వార్డులకు గాను 40 నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాలోని అమన్‌గల్, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మొయినాబాద్, షాద్‌నగర్, శంకర్‌పల్లి మున్సిపాలిటీలలో అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తంగా 39 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించగా, మొత్తం 40 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రశాంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తదితర ప్రక్రియలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారులు వెల్లడించారు. అమన్‌గల్ మున్సిపాలిటీ 8 నామినేషన్లు,చేవెళ్ల మున్సిపాలిటీ 9 నామినేషన్లు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 3 నామినేషన్లు, మొయినాబాద్ మున్సిపాలిటీ 5 నామినేషన్లు, షాద్‌నగర్ మున్సిపాలిటీ 8 నామినేషన్లు, శంకర్‌పల్లి మున్సిపాలిటీ 8 నామినేషన్లు దాఖలు అయినట్టు అధికారులు వెల్లడించారు.

## నామినేషన్ సెంటర్ల వద్ద బందోబస్తు

### అలియాబాద్‌లో 16, ఎంసిపల్లిలో 9 నామినేషన్లు

**శామీర్‌పేట, జనవరి 28, ప్రభాతవార్త :** మూడుచింతలపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మున్సిపల్‌లోని వార్డులకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కావటంతో ఏర్పాట్లను మల్కాజ్‌గిరి జోన్ డిసిపి శ్రీధర్ సందర్శించి పరిశీలించారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్డులకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. దీనికి సంబంధించి నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లను డిసిపి శ్రీధర్ పరిశీలించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ ఏసిపి చక్రపాణి, శామీర్‌పేట సిఐ శ్రీనాథ్, డిఐ రాజు, పలువురు పోలీసు ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు ఏసిపి చక్రపాణి పర్యవేక్షణలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు జరిగింది. అయితే మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని 24వార్డులకు నామినేషన్ల స్వీకరణకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెంటర్ ఏర్పాటు చేసి ప్రతి మూడు వార్డులకు 8మంది ఆర్ఓలు,8మంది ఏఆర్ఓలు నియమితులై నామినేషన్లను స్వీకరిస్తున్నారు. ..నామినేషన్ దాఖలు ..అయితే మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని 2వ వార్డు (నారాయణపూర్,పోతారం గ్రామాల)కు బుద్ధి నవ్య (బిఆర్ఎస్ అభ్యర్థి) తన నామినేషన్ పత్రాలను సెంటర్‌లోని రిటర్నింగ్ అధికారికి అందజేశారు. అదే విధంగా 2వ వార్డుకు రత్నాల శ్రావణి(కాంగ్రెస్), రమారెడ్డి వంగ (కాంగ్రెస్), వంగ ప్రియాంక (బిజెపి), 4వ వార్డుకు జాము రవి (బిఆర్ఎస్), జెరిపోతుల నర్సింలు(కాంగ్రెస్), 10వ వార్డుకు గోవర్ధన్‌రెడ్డి మెరుపాటి (కాంగ్రెస్), బుట్టంగారి మాదవరెడ్డి (బిఆర్ఎస్), 9వ వార్డుకు పెద్దిరెడ్డి శ్రీలత (కాంగ్రెస్)కు ఆయా వార్డులకు మొత్తం 9మంది అభ్యర్థులు ఆయా వార్డుల రిటర్నింగ్ అధికారులకు నామినేషన్లు అందజేసినట్లు మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు.



అలియాబాద్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న సిఐ గురువయ్య

**అలియాబాద్ మున్సిపాల్టీలో...**

అలియాబాద్ మున్సిపాల్టీలో 20వార్డులు ఉండగ మొదటి రోజు వివిధ వార్డులకు 16నామినేషన్లు ఆర్ఓలకు అందినట్లు అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం జరిగింది. 4వ వార్డుకు-1 నామినేషన్ (బిజెపి), 6వవార్డుకు-1 (బిజెపి), 7వ వార్డుకు-3నామినేషన్లు జనసేన,కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థులు అందజేశారు. 8వ వార్డుకు-2 కాంగ్రెస్ అభ్యర్థులు, 9వవార్డుకు-1బిఆర్ఎస్, 10వ వార్డుకు-1 బిఆర్ఎస్, 11వ వార్డుకు-2 కాంగ్రెస్, బిఆర్ఎస్, 17వ వార్డుకు-3 జనసేన, కాంగ్రెస్, బిఆర్ఎస్, 18వ వార్డుకు-1కాంగ్రెస్, 20వ వార్డుకు-1.కాంగ్రెస్ నామినేషన్లను అభ్యర్థులు రిటర్నింగ్ అధికారులకు అందజేసినట్లు మొత్తం 16 నామినేషన్లు అందగ వీటిలో కాంగ్రెస్-7, బిజెపి-2, బిఆర్ఎస్-2, జనసేన-2 అభ్యర్థులు నామినేషన్ వేశారని కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగ నిర్వహించటానికి జీనోమ్‌వ్యాలీ పిఎస్ సిఐ గురువయ్య ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ కోసం వార్డుల వారీగ స్వీకరించటానికి కౌంటర్లను ఏర్పాటు చేసి రిటర్నింగ్ అధికారులు స్వీకరిస్తున్నారు.

**ఎల్లంపేట మున్సిపాలిటీలో నాలుగు..**

**మేడ్చల్, జనవరి 28, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ పక్రియ బుధవారం మొదలు కావడంతో మొదటి రోజు నలుగురు అభ్యర్థులు కౌన్సిలర్ స్థానానికి నామినేషన్లు వేశారు. మంగళవారం మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ రావడం వెనువెంటనే ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేయడంతో నామినేషన్ల హడావిబడి నెలకొన్నది. ఎల్లంపేట మున్సిపల్ ఎన్నికల నామినేషన్ పత్రాల స్వీకరణ కోసం డబిల్‌పూర్‌లోని భారత్ బైబిల్ కళాశాలలో కేంద్రాఉన్ని ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో 24 వార్డులు ఉండగా ఆరు వార్డులకు ఒక్కో గది చొప్పున మొత్తం నాలుగు గదులను నామినేషన్ల కోసం కేటాయించారు. అందులో ఆర్ఓతో పాటు సిబ్బందిని నియమించారు. బుధవారం మొదటి రోజు నాలుగు నామినేషన్లు రాగ అందులో కాంగ్రెస్ నుండి 5వ వార్డులో పార్వతి, 17వ వార్డులో భిక్షపతి, 18వ వార్డులో అనిల్ కుమార్ నామినేషన్ వేయగా, బీజేపీ పార్టీ 24వ వార్డులో అర్చన నామినేషన్ దాఖలు చేశారు.

**కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ :** మున్సిపల్ (అర్బన్ లోకల్‌బాడీస్) ఎన్నికల-2026 సందర్భంగా మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఎన్నికల సంబంధించిన ఫిర్యాదుల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఎన్నికల నోడల్ అధికారి ఎన్.పద్మజ పేర్కొన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాల్టీలకు ఎన్నికలు జరుగుతున్నందున ఎన్నికల సంబంధిత ఫిర్యాదుల కోసం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. హెల్ప్‌డెస్క్ నెంబరు 9492409781నందు సంప్రదించాలని ఎన్నికల నోడల్ అధికారి పేర్కొన్నారు.

# ఓట్ల కోసం కాసుల వేట





### ఆస్తులు అమ్మి మరీ పోటీకి సై..
### ప్లాట్లు..ఇళ్లు తాకట్టు పెడుతున్న ఆశావహులు

**రూ.కోట్లకు పడగలెత్తనున్న పుర పోరు**

- పరిమితికి మించి 20 రెట్లు ఖర్చు
- అధిష్టానం నుంచి వార్డుల వారీ రూ.10 లక్షల చొప్పున ఆసరా?
- చైర్మన్ సీటుకు రూ.కోటి దాటుతుందని అంచనా
- కౌన్సిలర్‌కు రూ.20 లక్షలు పైమాటే
- సీనియర్లతోపాటు కొత్త ముఖాలూ తెరపైకి..
- ఆచితూచి అడుగులు వేస్తున్న అధినేతలు

**ఈసారి మున్సిపల్ పోరు రూ.కోట్లకు పడగలెత్తే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ప్రధాన పార్టీలు ఓట్ల లెక్కలు వేసుకుంటున్నాయి. అదే సమయంలో కేటగిరీలుగా విభజించుకుంటున్నాయి. ఓటర్ల వారీగా జాబితాలు సిద్ధం చేస్తున్నారు. నేరుగా ఓటర్లకే డబ్బులు, బహుమతులు అందేలా ఇప్పటి నుంచే ప్రధాన పార్టీలలో టికెట్‌పై ధీమా ఉన్న ఆశావహులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసం కాసుల వేట కూడా మొదలు పెట్టారు. పలు వార్డులలో ఆశావహులు ఆస్తులను అమ్మకానికి పెడుతున్నారు. కొంతమంది ఇళ్లు, ప్లాట్లు కూడా తాకట్టు పెట్టి డబ్బులు తీసుకువచ్చేందుకు సిద్ధమవుతున్నారు.**

**(ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి) :** వికారాబాద్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 1,74,509 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళా ఓటర్లు 88,696 మంది ఉండగా పురుషులు 85,781 మంది ఉన్నట్లు అధికారులు తేల్చారు. మరో 32 మంది ఇతరులు ఉన్నారు. ఈ నాలుగింటిలో 100 మున్సిపల్ వార్డులు ఉన్నాయి. వీటిలో పలు చోట్ల రాజకీయాలపై ఆసక్తిగల అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీ చేసేం దుకు తహతహ లాడుతున్నారు. పాత వారి కంటే కొత్త మొఖాలే ఎక్కువగా ఆసక్తి చూపిస్తు న్నాయి. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన రోజు నుంచే వార్డుల్లో ఆశావహుల సందడి మొదలైంది. ఆయా రాజకీయ పార్టీల్లో పనిచేసిన సీనియర్లతోపాటు కొత్తగా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన వారు కూడ టికెట్లు ఆశిస్తున్నారు.

**జనరల్ స్థానాల్లో రూ.4 కోట్లు!**

ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చేయాల్సిన ఖర్చు కన్నా 20 రెట్లు ఎక్కువగానే ఖర్చు చేయాల్సి వస్తోందని తెలుస్తోంది. మున్సిపల్ కౌన్సిలర్‌గా పోటీ చేయాలంటే కనీసం రూ.20 లక్షలు గుల్ల చేసుకోవాల్సిందే అంటున్నారు. అదే జనరల్ స్థానాల్లో మాత్రం వ్యయం మరింత రెట్టింపు కావచ్చని భావిస్తున్నారు.

చైర్మన్ అభ్యర్థులకైతే కౌన్సిలర్‌గా గెలవాలంటే అక్షరాలా రూ.కోటి మించుతుందని అంటున్నారు. ఇంత ఖర్చు చేసినా ఐదేళ్లలో తిరిగి రాబట్టలేని పరిస్థితి ఉంటుందని కొంత మంది వెనకంజ వేస్తున్నారు.

జనరల్ స్థానాల్లో చాలావరకు పోటీ ఎక్కువగానే ఉంటుంది. వారిపై పోటీ చేసే వ్యక్తులు కూడా దండిగా ఖర్చు చేసేందుకు సిద్ధమ వుతున్నారు.

**చేతిలో డబ్బు లేక సతమతం**

ప్రస్తుత పరిస్థితుల్లో చాలామంది అభ్యర్థుల వద్ద చేతిలో డబ్బు లేక సతమతం అవుతున్నారు. కొంతమంది ఆస్తులను తాకట్టు పెట్టి పోటీకి దిగుతున్నట్లు తెలియవచ్చింది. చైర్మన్ అభ్యర్థులు కూడా రూ.2 నుంచి 4 కోట్ల రూపాయల వరకు ఇప్పటికే సర్ది పెట్టుకున్నట్లు సమాచారం. ఆస్తులు అమ్మకానికి పెట్టి వచ్చిన డబ్బులనే ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలలో కేవలం రెండు పట్టణాల్లోనే ఖర్చులు తడిసి మోపెడవుతాయని అంటున్నారు. జనరల్ వార్డుల తర్వాత బీసీ వార్డులకూ భారీగానే ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ఎస్సీ, ఎస్టీ వార్డులకైతే కనీసం 20 లక్షల రూపాయల వరకు వ్యయం చేయాల్సి వస్తుందని అనధికారికంగా అంచనాలు వేస్తు న్నారు.

**స్కాచ్ బాటిళ్లు రెడీ!**

జిల్లాలో వైన్స్‌లకీ భారీగా గిరాకీ పెరిగింది. గత వారం రోజులుగా కౌన్సిలర్ ఆశావహులు తమ అనుయాయులకు మద్యం సరఫరా చేస్తున్నారు. చీప్‌లిక్కర్ మొదలుకుని మధ్య స్థాయి ధరల మద్యం పంపిణీ చేస్తున్నారు. విద్యావంతులు, వ్యాపారులు ఉన్నచోట్ల స్కాచ్ విస్కీ బాటిళ్లు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. స్కాచ్ పంపిణీ చేసే వార్డుల్లో డబ్బు పంపిణీ కాస్త తక్కువగా ఉంటుందని అంటున్నారు. అయితే, స్కాచ్ పంపిణీ కన్నా డబ్బులు పంపిణీ చేయడమే ఉత్తమమని కొంతమంది అభ్యర్థులు అనుకుంటున్నారు. స్కాచ్ ధర రూ.2 వేల మాటే ఉంటుందని, అదే ఓటుకు రూ.వెయ్యి చొప్పున ఇవ్వడమే ఉత్తమ మార్గమని ఓ అభ్యర్థి వ్యాఖ్యానించడం గమనార్హం.

**చైర్మన్ అభ్యర్థుల వరకే సపోర్ట్?**

అయితే, రాజకీయ పార్టీల అధిష్టానాలు కూడా అభ్యర్థుల ఖర్చులకు డబ్బులు ఇచ్చేందుకు సిద్ధమ వుతున్నాయి. కొన్ని పార్టీల్లో చైర్మన్ అభ్యర్థులే ఖర్చులు భరించేందుకు ముందుకు వచ్చారని సమాచారం. ఒక్కో కౌన్సిలర్‌కు రూ.5లక్షల నుంచి 10 లక్షల వరకూ ఇస్తామని ముందుకు వస్తున్నారని తెలిసింది. కొన్ని పార్టీల్లో అన్ని వార్డులకూ అభ్య ర్థులు లభించడం లేదు. దానివల్ల అధిష్టానాలకు కాస్త భారం తగ్గుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లోనే ఎక్కువగా డబ్బులు ఖర్చు కావచ్చని భావిస్తున్నారు. ఆ పార్టీల అధిష్టానాలే అభ్యర్థలకూ ఇవ్వవచ్చని, మిగిలిన పార్టీల్లో రిక్త హస్తాలు చూపవచ్చని అనుకుంటున్నారు.

## గీత దాటితే వేటు ఖాయం

### ఎన్నికల కోడ్ అమలుపై అబ్జర్వర్ మయాంక్ మిట్టల్ వార్నింగ్

**రంగారెడ్డి అర్బన్, జనవరి28, ప్రభాతవార్త:** రానున్న రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి మాత్రమే స్వీకరించాలని జనరల్ అబ్జర్వర్ మయాంక్ మిట్టల్ రిటర్నింగ్ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. బుధవారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని జనరల్ అబ్జర్వర్ మయాంక్ మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీనివాస్‌లతో కలిసి పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న అభ్యర్థుల వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని జనరల్ అబ్జర్వర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన నివేదికలను సకాలంలో జిల్లా కేంద్రానికి పంపించాలని ఆదేశించారు. ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద సహాయక కేంద్రం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణ సమయంలో అభ్యర్థులు సమర్పించాల్సిన ధ్రువీకరణ పత్రాలపై స్పష్టమైన సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. ఏవైనా సందేహాలు తలెత్తినప్పుడు స్వంత నిర్ణయాలు తీసుకోకుండా ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ అధికారి అనంత్ రెడ్డి, సంబంధిత ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఎన్నికల నియంత్రణ కేంద్రాలు ప్రారంభం**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాలం లో సమాచార కేంద్రం, ఫిర్యాదు, వినతుల స్వీకరణ కేంద్రం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి. నారాయణ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలు-2026 నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక నియంత్రణ గది ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారం పొందేందుకు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేయేందుకు 9849906949 నంబర్‌తో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నియంత్రణ గదిలో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని, ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేసి వచ్చిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసి తక్షణ చర్యలు తీసుకునే విధంగా వ్యవస్థ రూపొందించినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఏవైనా ఫిర్యాదులు, సందేహాలు ఉంటే ఈ నంబర్‌ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.



కంట్రోల్ రూమ్ ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి



పల్టీ కొట్టిన స్కూలు బస్సు

## స్కూల్ బస్ బోల్తా

### పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు

**చేవెళ్ల, జనవరి 28, ప్రభాతవార్త:** స్కూల్ బస్ బోల్తా పడి పలువురు విద్యార్థులకు గాయాలైన సంఘటన మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మృగవని పార్కు వద్ద చోటుచేసుకుంది . హైదరాబాద్ బీజాపూర్ హైవే పై స్కూల్ బస్ బోల్తా పడిందన్న విషయం తెలుసుకున్న ఫ్యూచర్ సిటీ డిసిపి యోగేష్ గౌతమ్ మొయినాబాద్ సీఐ పవన్ కుమార్ రెడ్డి పోలీస్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు బస్సులో ఉన్న విద్యార్థులను వాహనదారుల సహాయంతో అందరినీ బస్సులో నుండి బయటకి తీసి గాయపడిన వారిని సమీపంలోని సాదన్ ఆసుపత్రికి తరలించారు. బస్సులో ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా బస్సు బోల్తా పడడంతో ఉలికిపడి భయభ్రాంతులకు గురై రోదించడం మొదలు పెట్టారని ప్రత్యక్ష సాక్షులు వివరించారు. ఈ సందర్భంగా డిసిపి యోగేష్ గౌతం మాట్లాడుతూ.. గండిపేట్ మండల్ జిహెచ్ఎంసి పరిధిలోని బండ్లగూడ జాగీర్‌లో గల హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఎక్సెన్స్ స్కూల్ కోసం స్కూల్ బస్లో మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజిత్ నగర్ చౌరస్తాలో గల చాందిని గార్డెన్ వచ్చి తిరిగి వెళుతున్న సమయంలో అజీజ్ నగర్ రెవెన్యూ పరిధిలో గల మృగవాని పార్కు వద్ద కు రాగానే బస్సు వెంకటయ్యర్ పుంషర్ కావడంతో రోడ్డు మధ్యలో డివైడర్‌పై ఉన్న స్తంభాన్ని వేగంతో బస్సు ఢీకొట్టడంతో బస్సు ముందు భాగంలో ఉన్న రెండు టైర్స్ కనెక్టింగ్ రాడ్‌తో సహా ఊడిపోవడంతో బస్సు బోల్తా పడిందన్నారు. బస్సు బోల్తా పడినప్పుడు బస్సులో 25 మంది విద్యార్థులు ఒక స్కూల్ ఆయమ్మ డ్రైవర్ ఉన్నారు విద్యార్థుల్లో సుమారు 15 మందికి

మిగతా 2లో

## ఎన్నికల పరిశీలకులుగా ఐఏఎస్ అధికారుల నియామకం

**శామీర్‌పేట (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జనవరి 28, ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జిల్లాకు ఎన్నికల సాదారణ పరిశీలకులుగా కొర్ర లక్ష్మి(ఐఏఎస్), వ్యయ పరిశీలకులుగా సునయాన చౌహాన్‌లు నియమితులయ్యారు. జిల్లాలోని అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మూడు మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నందున వారు నియమితుల య్యారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు ఆమె విచ్చేశారు. ఆ తరువాత మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరితో కలిసి సాదారణ పరిశీలకురాలు కొర్ర లక్ష్మి అలియాబాద్ మున్సిపాల్టీలోని పోలింగ్ బూత్‌లను సందర్శించి పరిశీలించారు. కావలసిన మౌలిక సదుపాయాలను, రేలింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలియాబాద్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, మండల పరిషత్ పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను కూడా పరిశీలించారు.



అలియాబాద్ మున్సిపాల్టీలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల పరిశీలకురాలు కొర్ర లక్ష్మి, కలెక్టర్ మనుచౌదరి

## ఆశావహులకు బుజ్జగింపులు

**పరిగి జనవరి 28 ప్రభాతవార్త :** పరిగి పురపాలక పోరులో వార్డుల వారిగా పోటీ పడటానికీ, పార్టీల నుండి బి.ఫామ్.లు దక్కించుకునేందుకు ఆశావహులు నాయకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. నామినేషన్ల తొలి రోజు కేవలం రెండు వార్డులకు మాత్రమే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.. పరిగి మున్సిపాలిటీలోని 7వ వార్డు నుండి ఫిరంగి పద్మ , 17వ వార్డు నుండి ఎస్పి శ్రీనివాస్‌లు నామినేషన్లు వేశారు. ఎలాగైనా చైర్ పర్సన్ పీఠాన్ని దక్కించుకోవాలన్న తపనతో కాంగ్రెస్ , బిఆర్ఎస్, బిజెపి పార్టీల పెద్దలు పావులు కదుపుతున్నారు. అధికార పార్టీ అయిన కాంగ్రెస్ నుండి వార్డుకు ఇద్దరికీ పైగా టికెట్ ఆశించినప్పటికీ, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆద్వర్యంలో పరిగి నాయకులతో కలిసి దాదాపు 18 వార్డుల్లో 17 వార్డులకు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు

మిగతా 2లో



ఛాంపియన్ షిప్ పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

## ఎస్.ఆర్.కే క్లాసిక్ బాడీ బిల్డింగ్, అండ్ ఫిట్నెస్ ఛాంపియన్ షిప్ పోస్టర్ విడుదల

**షాద్‌నగర్, జనవరి 28, ప్రభాతవార్త :** మంచి శరీర దృఢత్వం ప్రతి ఒక్కరికి అవసరమని, అందుకోసం వ్యాయామం తప్పనిసరిగా చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ ఎస్.ఆర్.కె క్లాసిక్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ కు సంబంధించిన పోటీలను ఈ సంస్థ నిర్వాహకుడు షారుక్ నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల నిర్వహణ ద్వారా యువతలో ఉత్సాహం నింపుతున్న నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు షారుఖ్ మాట్లాడుతూ దీనికి సంబంధించి ఛాంపియన్షిప్ పోటీలను వచ్చేనెల ఫిబ్రవరి నాలుగవ తేదీన ఐదు గంటలకు కుట్ల రామిరెడ్డి గార్డెన్ లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విజేతలకు 3,20,000 (మూడు లక్షల ఇరవై వేలు) క్యాష్ ప్రైస్ బహుమతుల రూపంలో అందజేయనున్నట్లు వెల్లడించారు. నిర్వాహక బృందం భూపతి, హరి, సోహైల్, అఖిల్ పాల్గొన్నారు.

## బిజెపి నేత ప్రభాకర్ బిఆర్ఎస్‌లో చేరిక

**షాద్‌నగర్, జనవరి 28, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణం శ్రీనివాస కాలనీకి చెందిన బీజేపీ నాయకులు శానమోని ప్రభాకర్, రియాజ్, అయ్యప్ప తదితరులు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గారు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఆశావహులకు బుజ్జగింపులు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ నాయకులు, కార్యకర్తల్లో చర్చించుకుంటున్నారు..ఇటు బిఆర్ఎస్ పార్టీ ఒకసారి పాలకవర్గాన్ని పాలించిన అనుభవంతో ఈ ఎన్నికల్లో మళ్లీ పీఠం దక్కించుకోవాలని ఆచితూచి అభ్యర్థుల ఎంపికను మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి దగ్గరుండి పర్యవేక్షి స్తున్నారు. రెండు పార్టీలకు గట్టి పోటీ ఇవ్వడానికి బి.జె.పి. పార్టీ నాయకులు కూడా అభ్యర్థుల ఎంపికలో వేట మొదలుపెట్టారు.. అయితే కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నుంచి టికెట్ లభించకపోయిన ఒకరిద్దరూ స్వతంత్రంగా ముందుకు వెళ్లాలని కార్యకర్తలు ప్రోత్సాహిస్నిస్తున్నారు. ఆశావహుల అలకలు,పార్టీ పెద్దల ముందు పంచాయితీలతో టికెట్ రాని నాయకులను బుజ్జగించి ఎంపిక అయిన అభ్యర్థులకు మద్దతు తెలపాలని కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ పెద్దలు నాయకులకు సూచిస్తున్నారు.. మూడు పార్టీలనుండి పోటీ బలంగా ఉంటుదని, అభ్యర్థులను బట్టి ఓటు వేస్తామని ఓటర్లు భావిస్తున్నారు .

## స్కూల్ బస్ బోల్తా

(మొదటి పేజీ తరువాయి)

చిన్నచిన్న స్వల్ప గాయాలు కావడంతో సమీపంలోని సాధన ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించామని తెలిపారు ఏది ఏమైనా విద్యార్థులకు పెను ప్రమాదమే తప్పిందని ఆయన అభిప్రాయపడ్డారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు ప్రమాదం కారణంగా హైదరాబాద్ బీజాపూర్ హైవే పై భారీ ట్రాఫిక్ జామ్ అయింది విద్యార్థులకు పెను ప్రమాదమే తప్పింది.... చేవెళ్ల ఇన్చార్జ్ ఆర్డిఓ వెంకట్ రెడ్డి. మృగవని పార్క్ వద్ద స్కూల్ బస్ పల్టీ కొట్టిన విషయం తెలుసుకున్న చేవెళ్ల ఇన్చార్జి ఆర్డీవో వెంకటరెడ్డి మొయినాబాద్ తాసిల్దార్ గౌతం కుమార్ హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు విద్యార్థులకు ఎవరికైనా ఏమైనా ప్రమాదం జరిగిందా అన్న విషయాన్ని అక్కడున్న పోలీసులను ప్రత్యక్ష సాక్షులను అడిగి తెలుసుకున్నారు ఎవరికి ఎలాంటి పెను ప్రమాదం జరగలేదు బస్సులో ఉన్న కొందరు విద్యార్థులకు స్వల్ప గాయాలు అయ్యాయని తెలుసుకొని వారు ఊపిరి పీల్చుకున్నారు ఈ సందర్భంగా ఆర్డీవో వెంకటరెడ్డి మాట్లాడుతూ ఏదిఏమైనా విద్యార్థులకు పెను ప్రమాదమే తప్పిందన్నారు ముఖ్యంగా పాఠశాల యాజమాన్యాలు బస్సులను ఎప్పటికప్పుడు చెక్ చేస్తూ అనుభవమున్న డ్రైవర్లను తీసుకోవాలన్నారు పాఠశాల యాజమాన్యాలకు ఫీజుల మీద ఉన్న శ్రద్ధ పిల్లల బాధ్యత లేదు ముఖ్యంగా ఆర్టిఏ అధికారులు ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులకు ఎలా అనుమతిస్తున్నారు . ఇలాంటి సంఘటన జరిగినప్పుడు పాఠశాల యాజమాన్యాలపై ఆర్టిఏ అధికారులపై కేసు నమోదు చేయాలి ఈరోజు పిల్లలకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు లేకపోతే ఏమైనా పెను ప్రమాదం జరిగి ఉంటే ఎవరిది బాధ్యత దీని ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల యాజమాన్యంపై ఆర్టిఏ అధికారులపై తప్పకుండా చర్యలు తీసుకోవాలి జరిగిన సంఘటన నా కళ్ళముందే జరిగింది నేను ఉల్లికిపడ్డ బస్సులో ఉన్న పిల్లలు ఎంత భయభ్రాంతులకు గురయ్యారు నా కళ్ళతో చూశాను కచ్చితంగా పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి ఫిట్నెస్ లేని బస్సులను నడుపుతున్నారు ఆ కారణంగానే ఈరోజు బస్ బోల్తా పడింది

## ఆర్ఓబీ పూర్తి చేయాలని కరపత్రాల పంపిణీ



**ఘట్‌కేసర్, జనవరి 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వేవంతెన నిర్మాణ పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలంటూ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ప్రజలను చైతన్యం చేసేందుకు పూను కున్నారు. ఈమేరకు బుధవారం ఆయన ఘట్‌కేసర్ డివిజన్ సంస్కృతి కళాశాల బృందావన్ కాలనీలో ఇంటింటికి తిరిగి వంతెన పనుల నిర్లక్ష్యంపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. వంతెన పనులు గత 13 ఏళ్లుగా నత్తనడకన జరుగుతున్నాయని అధికారులు అలసత్వంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పోరాటం చేయడం ద్వారా వంతెన పూర్తవుతుందని ఆయన ప్రజలకు తెలియజేశారు. అబ్బసాని వెంట నాగభూషణం, బర్ల

# గురుకుల్‌లో సిఎం కప్-2 క్రీడాపోటీలు ప్రారంభం


ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఇఓ శ్రీధర్


గురుకుల్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

**ఘట్‌కేసర్, జనవరి 28, ప్రభాతవార్త:** క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని మండల విద్యాధికారి శ్రీధర్ అన్నారు. ఘట్‌కేసర్ గురుకుల్ హైస్కూల్ మైదానంలో బుధవారం సెకండ్ ఎడిషన్ సీఎం కప్ 2025 మండల స్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొని విద్యార్థులకు క్రీడల ప్రాధాన్యతను తెలియజేసి పోటీలను తిలకించారు. సీఎం కప్-2 లో భాగంగా ఎంఇఓ శ్రీధర్ మొదటి రోజు అండర్-18 బాలికలు, బాలుర కబడ్డీ పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొదించేందుకు విద్యార్థులకు ప్రతి సంవత్సరం సీఎం కప్ క్రీడాపోటీలను నిర్వహిస్తుందన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని భవిష్యత్తులో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా వస్తాయని పేర్కొన్నారు. గురువారం చదరంగం, క్యారమ్స్, వాలీబాల్, ఖోఖో పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఘట్‌కేసర్ సర్కిల్ సహాయ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి, గిర్దావర్ సాయిరాం, ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ, రాములు, ఎస్‌జిఎఫ్ జోనల్ కార్యదర్శి శ్రీరాములు, పిజికల్ డైరక్టర్లు, పిఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 30న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌కు శంకుస్థాపన

**..మొగలిగిద్దకు రానున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**
**..ఏర్పాట్లను సమీక్షించిన రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి**


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

**షాద్‌నగర్, జనవరి 28, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లాలోని షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం మొగలిగిద్ద గ్రామంలో చారిత్రాత్మక 150 సంవత్సరాల ప్రభుత్వ పాఠశాలను రాష్ట్ర భూమయ్య మంత్రి బట్టి విక్రమార్క సందర్శించనున్నారు. గత ఏడాది రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ గ్రామానికి విచ్చేసి 150 సంవత్సరాల వార్షికోత్సవ కార్యక్రమానికి వచ్చారు. తెలంగాణలో నిరుపేదలకు నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వం ఉక్కు సంకల్పంతో ముందుకు వెళుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పట్లో పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల గౌరవం తగ్గకుండా, వాటి ప్రతిష్టను పెంచడానికి ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 150 ఏళ్ల పూర్తి చేసుకున్న మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాలను సందర్శించడం అదృష్టంగా భావిస్తున్నానని సీఎం రేవంత్ అప్పట్లో అన్నారు. ఈ పాఠశాలకు ఏ అవసరం ఉన్నా సహాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధం ఉందన్నారు. మొగిలిగిద్ద గ్రామానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)తో పాటు పాఠశాల నూతన భవనం, లైబ్రరీ నిర్మాణం కోసం 10 కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. గ్రామానికి అవసరమైన సీసీ రోడ్లు, మైనారిటీ కమ్యూనిటీ హాలు నిర్మాణం, జూనియర్ కాలేజీలో మౌలిక సదుపాయాల కోసం నిధుల మంజూరు చేశారు. ఈ సందర్భంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) శంకుస్థాపనకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వస్తుండడం విశేషం. ఈ సందర్భంగా బుధవారం గ్రామాన్ని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, ఏసిపి లక్ష్మీ నారాయణ, ఆర్డీవో సరిత, ఎంఈఓ మనోహర్, ఎమ్మార్వో నాగయ్య, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు గ్రామాన్ని సందర్శించి కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షి ంచారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి గ్రామస్తులు సర్పంచ్ కృష్ణ, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం గుట్ట రాజ్ పటాన్ పాషా వెంకటేష్ తౌడు వెంకటేష్ అమృత్సాగర్ రమేష్ డీలర్ మల్లేష్ శ్యాంసుందర్ కార్తీక్ మరియు తదితర గ్రామస్తులతో మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, ప్రొ. కోదండరాం, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రొ. హరగోపాల్‌తో పాటు స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు ఈ కార్యక్రమం కోసం పెద్ద ఎత్తున ఉన్నత అధికారులు వస్తున్నట్లు వారు తెలిపారు. జనవరి 30వ తేదీన కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టినట్లు తెలిపారు.

# కళాక్షేత్రం నిర్మాణానికి రూ.4.38 కోట్లు..

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న కళాకారులు

**షాద్‌నగర్, జనవరి 28, ప్రభాతవార్త :** అర్ధాంతరంగా ఆగిపోయిన కళాక్షేత్రాన్ని బాగు చేస్తానని కళాకారులకు మాటిచ్చాను.. ఇప్పుడు ఆ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాను.. ఇప్పుడే కాదు ఎప్పుడు కళాకారుల వెంటే ఉంటాను.. వారికి అన్ని విషయాల్లో అండగా ఉంటాను.. అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గత ప్రభుత్వ హయాంలో కళాక్షేత్రం మొదలైంది. నిర్మాణం మొదలుపెట్టి అర్ధాంతరంగా పనులు ఆపేశారు. ఈ నేపథ్యంలో కళాకారులు ఎమ్మెల్యేను కలవగా దానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి రూ.4.38 కోట్ల మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేకు కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంతోకాలంగా కళాకారుల కు ఒక వేదిక కావాలని ఎదురుచూస్తున్నామని ఆ కోరిక నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. ఎమ్మెల్యే మరో మూడు నెలల్లో కళాక్షేత్రాన్ని పూర్తి చేసి కళాకారుల చేతుల్లో పెడతానని హామీ ఇవ్వడం విశేషం. నియోజకవర్గ పరిధిలోని వివిధ కళా సంస్థలైన సంస్కారభారతికి చెందిన టీవీ రంగయ్య, సాహితీ కళాభారతి నుంచి హరీష్ కుమార్ శర్మ, కేపీ మ్యూజిక్ నుంచి ఎండి ఖాజా పాషా (కె.పి), శ్రీవాణి సాంస్కృతిక సంస్థ నుంచి కన్నా, శ్రీనివాస్ రెడ్డి, రంగ క్షేత్ర నట శిక్షణాలయం, నటమండలి నుంచి జేయస్వీ శివప్రసాద్ జీ, కళాజ్యోతి సాంస్కృతిక సంస్థ నుంచి వడ్ల రమేష్, శివ డాన్స్ అకాడమీ నుంచి రవీందర్ శివ, వెంకటేశ్వర సంగీత నృత్య అకాడమీ నుంచి ప్రవీణ్ తబలా, సరరాగ సంగీత సుధా మ్యూజిక్ అకాడమీ నుంచి ప్రేమ్ రాజ్, ప్రబోదయ డాన్స్ అకాడమీ నుంచి రంజు ప్రవీణ, లక్ష్మీ నరసింహస్వామి నాటక కళా సంస్థ నుంచి, శివాజీ కల్చర్ అసోసియేషన్ నుంచి సింగారం శ్రీనివాస్, శ్రీ వెంకటేశ్వర కళా నాట్యమండలి నుంచి విజయ రెడ్డి, కె.ఆర్ అకాడమీ ఆఫ్ ఇండియన్ కల్చర్ పెర్ఫార్మెన్స్ నుంచి రాఘవేందర్, శ్రీ సీతారామచంద్ర పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ నుంచి గోపాల్ రెడ్డి, ఎస్సార్ డాన్స్ అకాడమీ నుంచి కోనేటి రాజు, రంగనాథం పెనుకొండ కృష్ణ, పరంధాములు గౌడ్, యాదగిరి ఆచారి, పురుషో త్తమా చారి, సంపత్ చారి, రఘురామ చారి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విశ్వేశ్వరగిరిక్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం


సిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వరస్వామి కళ్యాణం

**ఘట్‌కేసర్, జనవరి 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శ్రీవిశ్వేశ్వరగిరి (హరిహర) క్షేత్రంలో ఈనెల 28 నుంచి 31 వరకు 35వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి శ్రీఆత్మానందభారతీస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థాన నిర్మాణం చేసి 34 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయంలో బుధవారం సిద్దిబుద్ది సమేత విఘ్నేశ్వరస్వామికి అభిషేకం, అర్చన, శ్రీచక్రార్చన, లక్ష్మీగణపతి హోమం, సిద్దిబుద్ది సమేత విఘ్నేశ్వరస్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్చారణాల మధ్య పూజలు చేయగా భక్తులు విచ్చేసి స్వామినఇ దర్శించుకొని పూజలు చేశారు. ఈనెల 29న వల్లీదేవసేన సమేత కుమారస్వామికి అభిషేకం, అర్చన, శ్రీచక్రార్చన, సుబ్రమణ్యస్వామి హోమం, కళ్యాణం, 30న శ్రీయోగానంద లక్ష్మీనరసింహ్మస్వామికి అభిషేకం, అర్చన, శ్రీచక్రార్చన, సుదర్శనహోమం, లక్ష్మీనర్సిం హ్మస్వామి కళ్యాణం, 31న శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామికి అభిషేకం, అర్చన, శ్రీచక్రార్చన, అష్టాక్షరీ హోమం, శ్రీనివాసస్వామి కళ్యాణం, ఫిబ్రవరి 1న మాఘ పౌర్ణమి సందర్భంగా మహాలక్ష్మి మహాసరస్వతి సమేత రాజరాజేశ్వరదేవికి అభిషేకం, అర్చన, శ్రీచక్రార్చన, చండీహోమం, శివపార్వతుల కళ్యాణం, 2న మధ్యాహ్నం 3 గంటలకు ఎన్ఎఫ్‌సీకాలనీలో ఉత్సవ విగ్రహాలతో రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని ఆయన కోరారు.


మాజీ సర్పంచ్ కావేరి మచ్చేంధర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి లక్ష్మారెడ్డి

## ఆడబిడ్డలకు అండగా వైఎస్ రెడ్డి ట్రస్టు

**-తల్లులకు ఎస్ఎస్‌వై ఖాతా బుక్‌లు**

**ఘట్‌కేసర్, జనవరి 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లో బుధవారం పోస్టల్ శాఖ అధికారులు ఎస్ఎస్‌వై పథకం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడబిడ్డలు కల్గిన తల్లిదండ్రులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సుకన్య సమృద్ధి యోజన పథకం ప్రయోజనాలను తెలియజేశారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ రెడ్డి ట్రస్ట్ ద్వారా పోస్టాఫీస్‌లో ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరచి ఖాతా పుస్తకాలను అందజేశారు. ఆడపిల్లల భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించే ఎస్ఎస్‌వై పథకాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈమేరకు మాజీ సర్పంచ్ ఏనుగు కావేరి మచ్చేంధర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి ఏనుగు లక్ష్మారెడ్డిల చేతుల మీదుగా ఖాతా పుస్తకాలను చిన్నారుల తల్లులకు అందజేశారు.



నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

## తొలి రోజు నామినేషన్ల జాతర

**తాండూరులో 11 నామినేషన్‌లు దాఖలు**

**తాండూరు, జనవరి 28, ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల నామినేషన్‌ల పర్వం తాండూరులో ప్రారంభమైంది. మొదటి రోజు 11 నామినేషన్‌లు దాఖలు చేశారు. తాండూరు మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులకు సంబంధించి 11మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేసినట్లు తాండూరు మున్సిపల్ ఎన్నికల అధికారి, కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.. నామినేషన్ స్వీకరణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ తరపున 5మంది, బిఆర్ఎస్ నుంచి 5 మంది అభ్యర్థులు, బిజెపి నుంచి ఒక్కరు నామినేషన్ దాఖలు చేశారు మరోవైపు తాండూరు తహసిల్దార్ తారాసింగ్ నామినేషన్ స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందో బస్తును ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తాండూరు డిఎస్పీ నర్సింగ్ యాదయ్య పర్యవేక్షణలో పట్టణ సిఐ సంతోష్‌కుమార్, సిబ్బందితో బందో బస్తు నిర్వహించారు.

## షాద్‌నగర్‌లో వివరాలు గోప్యం..?

**షాద్‌నగర్, జనవరి 28, ప్రభాతవార్త :** షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా బుధవారం మొదటి రోజు 6 నామినేషన్లు దాఖలేనట్టు అసిస్టెంట్ డిస్టిక్ ఎలక్షన్ అథారిటీ ఆఫీసర్ సునీత రెడ్డి మీడియాతో తెలిపారు. పట్టణంలోని ఐదవ వార్డు, ఏడవ వార్డు, ఎనిమిదవ వార్డు, 16వ వార్డు, 28 వార్డులకు మొత్తం 5 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు ఇందులో ఒకరు రెండు నామినేషన్ సెట్లను వేశారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలో పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలను ఫోటోలను ఎలక్షన్ అధికారులు గోప్యంగా ఉంచారు. పోటీ చేసేందుకు నామినేషన్లు దాఖలు చేసిన వారి వివరాలను మీడియాకు వెల్లడించలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పేర్లు ఫోటోలు మీడియాకు ఇవ్వలేదని అసిస్టెంట్ ఎలక్షన్ అథారిటీ ఆఫీసర్ సునీత రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా సోషల్ మీడియాలో ఆలుగడ్డ ప్రవీణ్ యాదవ్ తల్లి ఆలుగడ్డ పుష్పమ్మ తదితరులు నామినేషన్ వేసిన ఫోటోలు దర్శనమిచ్చాయి. మరి ఎన్నికల అధికారులు ఈ ఫోటోలను బయటికి ఎలా ఇచ్చారు నామినేషన్ పత్రాలు తీసుకుంటూ ఫోటోలు ఎలా పెట్టారో అధికారులకే తెలియాలి.

## ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

**రంగారెడ్డిఅర్బన్, జనవరి28,ప్రభాతవార్త:** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి వుండాలని జనరల్ అబ్జర్వర్ మయంక్ మిత్తల్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జనరల్ అబ్జర్వర్ మయంక్ మిత్తల్ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ లతో కలిసి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ, ఎన్నికల విధులు ఎంతో కీలకమైనవని, ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగకుండా అన్ని జాగ్రత్తలతో సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికలకు సంబంధించిన పనులు ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల మేరకు పూర్తి చేయాలన్నారు. అన్ని సెషన్లకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలింగ్ రోజు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు పకడ్బందీగా చేయాలన్నారు.ఎన్నికల సిబ్బందిని గుర్తించి, శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విధులు కేటాయించిన నోడల్ అధికారులు విధుల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున నోడల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తూ క్షేత్రస్థాయి నుంచి పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధులలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా, తమకు కేటాయించిన విధులను ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా నిర్వర్తించాలని సూచించారు. నోడల్ అధికారులందరు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, పిడి మెప్మా వెంకట నారాయణ, సీపీఓ సౌమ్య, బీసీ వెల్ఫేర్ అధికారి కేషు రామ్, సోషల్ వెల్ఫేర్ అధికారి రామరావు, మైనార్టీ వెల్ఫేర్ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, పిడి హౌసింగ్ చాంప్లా నాయక్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, మత్స్య శాఖ అధికారి పూర్ణిమ, సివిల్ సప్లయ్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్, ఆడిట్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, సంబంధిత అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు వెంట చెట్ల నరికివేత ..స్థానికుల ఆగ్రహం

**ఘట్‌కేసర్, జనవరి 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్‌లో చెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఆకృతి వెంచర్ నుంచి శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా గత కొన్ని సంవత్సరాల క్రితం మొక్కలు నాటగా చెట్లుగా ఎత్తుగా పెరిగాయని తెలిపారు. వెంచర్‌లో ప్లాటు కల్గిన యాజమాని వచ్చి తన పాటులో చెట్లు ఉన్నాయని గొడ్డలితో నరికివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో గ్రామంలో పచ్చధనం పెంపోందించేందుకు గ్రామ పంచా యతీ ఆధ్వర్యంలో రోడ్డు పక్కన పెంచిన పలు చెట్లను నరికివేయడం తగదని స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఒక వైపు మొక్కలు నాటి పెంచాలని ప్రచారం చేస్తుండగా ఇక్కడ మాత్రం ఎత్తుగా పెరిగి పచ్చధనం, ఆక్సిజన్ పంచుతున్న చెట్లను తొలగించారని వాపోయారు. ఘట్‌కేసర్ సర్కిల్, అటవీశాఖ అధికారులు విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని మాజీ ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.


ఘణాపూర్‌లో చెట్లను

## పోలింగ్ సిబ్బంది కేటాయింపు ప్రక్రియ పూర్తి

**కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహణ**

**రంగా రెడ్డి అర్బన్, జనవరి 28, ప్రభాత వార్త:** రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా బుధవారం పోలింగ్ సిబ్బంది తొలి యాదృచ్ఛిక కేటాయింపు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి. నారాయణ రెడ్డి నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ ఈ ప్రక్రియను నిర్వహించారు.రంగారెడ్డి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులను యాదృచ్ఛిక కేటాయింపు విధానంలో నియమించారు. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు వివిధ కేంద్రాల్లో మాస్టర్ శిక్షకుల ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో పోలింగ్ విధుల కోసం నియమించబడిన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులు జారీ చేసి సమాచారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ యాదృచ్ఛిక కేటాయింపు ప్రక్రియలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, మానవ వనరుల నిర్వహణ నోడల్ అధికారి శ్రీలక్ష్మి, పీడీ హౌసింగ్ చాంప్లా నాయక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


నామినేషన్ దాఖలు చేస్తున్న 6వ వార్డు అభ్యర్థి నేనావత్ పత్యనాయక్

# ఆమనగల్లులో 8..



8వార్డు నుండి నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అనుముల రమేశ్

**ఆమనగల్లు, జనవరి 28, ప్రభాతవార్త:** ఆమనగల్లు పురపాలిక సంఘం ఎన్నికల సమరం ఆరంభమైంది. రాష్ట్ర ఎన్నికల ఆదేశానుసారం అధికారులు అభ్యర్థుల నుండి నామినేషన్ల సమర్పణలకు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం జనవరి 28 నుండి 30 వరకు అభ్యర్థుల నుండి నామినేషన్ల పత్రాలను ఎన్నికల అధికారులు స్వీకరించనున్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులు నామినేషన్‌ల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే నామినేషన్ల దాఖలు పత్రాలను స్వీకరించేందుకు ప్రత్యేక అధికారుల బృందాన్ని నియమించారు. పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ వంటి నిబంధనలు అమలులోకి వచ్చాయి. నామినేషన్ దాఖలు కేంద్రాలను స్థానిక ఏసిపి జానకిరాం ఆమనగల్లులో పర్యటించి నామినేషన్ దాఖలు కేంద్రాలను పరిశీలించారు. అక్కడ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బందోబస్తు వివరాలను ఆమనగల్లు సీఐ జానకిరాంరెడ్డి, ఎస్సై బి. వెంకటేశ్‌లు ఏసిపికి వివరించారు. ఈమేరకు నామినేషన్ దాఖలు చేయడానికి నిర్వహించే ర్యాలీల పట్ల పలు సలహాలు, సూచనలు అందజేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బందోబస్తు నిర్వహించాలని సూచించారు. కాగా



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసిపి జానకిరాం

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో 15 వార్డులు ఉన్నాయి.

బుధవారం మొత్తం 8 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ దాఖలుకు మున్సిపాలిటీ కార్యాలయంలో కేంద్రం ఏర్పాటు చేయగా, 15 వార్డులకు గాను మూడు వార్డులకు ఒకటి చొప్పున మొత్తం 5 నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా నాలుగువ వార్డుకు 1, 5 వార్డుకు 2, 6 వార్డుకు 1, 8 వార్డుకు 1, 10వవార్డుకు 1, 12 వార్డుకు 2 చొప్పున అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. తొలిరోజు పలువార్డులకు అభ్యర్థులు హంగు హార్భాటం చేయకుండా నిరాడంబరంగా నామినేషన్ల పత్రాలు దాఖలు చేశారు. వీరిలో కొందరు రెండవ సెట్ వేయనున్నట్లు వెళ్ళడించారు.

# సిఎం కప్ టోర్నమెంట్ సంబురం

## - ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

**కొత్తూరు, జనవరి 28, ప్రభాతవార్త:** కొత్తూరు మున్సిపల్ కేంద్రంలో మండల స్థాయి సిఎం కప్ క్రీడా పోటీలను బుధవారం కొత్తూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్పర్సన్ లావణ్య దేవేందర్ యాదవ్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సిఎం కప్ టోర్నమెంట్‌కు మండలం లోని ఐదు క్లస్టర్ల నుంచి గూడూరు, పెంజర్ల, ఇన్మూల్ నర్వ, సిద్దాపూర్, కొత్తూరు గ్రామాలకు చెందిన యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 550 మంది క్రీడాకారులు వివిధ క్రీడల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. బుధవారం జరిగిన ప్రాథమిక పోటీల్లో గెలుపొందిన జట్లు, క్రీడాకారులకు గురువారం జరిగే ఫైనల్ గేమ్స్‌కు అర్హత లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యంగా సీఎం కప్ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ లావణ్య దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ గుణాలను పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ యువత ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం సీఎం కప్ లాంటి కార్యక్రమాలు నిర్వహించడం




సిఎం కప్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న చైర్పర్సన్ లావణ్య దేవేందర్ యాదవ్,అధికారులు,ఇతర నేతలు

అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతి, ఎమ్మార్వో రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఇన్స్పెక్టర్ నర్సయ్య, ఎంఈఓ సుదర్శన్ గౌడ్, పెంజర్ల సర్పంచ్ ఎర్రోళ్ల జగన్, సిద్దాపూర్ సర్పంచ్ వాసు నాయక్, సిద్దాపూర్ గ్రామ పెద్ద శేఖర్ రెడ్డి

# సిఎం కప్ క్రీడా పోటీలకు క్రీడాకారులు తరలిరండి

## ఎంపిడిఒ నర్సింలు

**ధారూరు, జనవరి 28, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి కప్ 2026 ఫేస్-2 లో భాగంగా ధారూర్ మండల కేంద్రంలో నిర్వహించే క్రీడా పోటీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న యువతీ ,యువకులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ధారూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీఎం కప్ చైర్మన్ నర్సింలు కోరారు.

ఈ నెల 30న శుక్రవారం ఉదయం 11.00 గంటలకు ధారూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ ఎంపికలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, యోగాతో పాటు ఇతర క్రీడలకు దరఖాస్తు చేసుకున్న క్రీడాకారులందరూ నిర్ణీత సమయానికి వేదిక వద్దకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ (ఎంఈఓ) శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు తహసిల్దార్ సాజిదా బేగం తదితరులు పాల్గొని పర్యవేక్షిస్తారని ఎంపిడిఒ వెల్లడించారు.

# బస్ సమస్యపై ఎంపీ స్పందన

## - ఆర్టీసీ ఎండికి లేఖ గ్రామీణ రవాణాపై ఆర్టీసీ బస్సు సేవల కోసం ఎండిని కలిసిన నానాజీపూర్ గ్రామస్తులు

**కొత్తూరు, జనవరి 28, ప్రభాతవార్త :** నానాజీపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు. ఇట్టి సమస్యపై గ్రామస్తులు చేవెల్లా ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ఇటీవల కలిశారు. తమ గ్రామానికి టీజీఎస్ఆర్టీసీ బస్సు సేవలు పునరుద్ధరించాలని వారు ఎంపికి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తుల సమస్యను సానుకూలంగా స్వీకరించిన ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి వెంటనే స్పందించారు. నంజీపూర్ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యను ఆర్టీసి ఎండి దృష్టికి తీసుకెళ్లుతూ అధికారికంగా ఎంపి లేఖ పంపించారు. ఇట్టి లేఖను గ్రామస్తులు ఆర్టిసి ఎండి నాగిరెడ్డిని కలిసి లేఖను అందజేశారు. లేఖలో, గతంలో శంషాబాద్-నంజీపూర్ మధ్య నడిచిన బస్ నం. 251ఎన్ సేవలను నిలిపి వేయడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, రోజువారీ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. బస్సు సౌకర్యం లేక గ్రామస్తులు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. రాజేంద్రనగర్ బస్ డిపో పరిధిలో నంజీపూర్‌కు ఉదయం, సాయంత్రం బస్సు సేవలు తిరిగి ప్రారంభించాలని ఎంపీ లేఖలో కోరారు. ప్రజా రవాణా



ఆర్టిసి ఎండి కలిసిన నేతలు

అనేది గ్రామీణ ప్రాంతాలకు ఎంతో కీలకమని, నంజీపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. గ్రామస్తుల సమస్యపై ఎంపీ తక్షణమే స్పందించి ఆర్టీసీ ఎండికి లేఖ పంపించడంతో నంజీపూర్ ప్రజల్లో ఆశలు చిగురించాయి. త్వరలోనే బస్సు సేవలు పునరుద్ధరించాలని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆరీసి ఎండిని కలిసిన వారు మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సురేష్‌రాజు, ఉప సర్పంచ్ విజయ్ కుమార్, వంగ మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు మున్నూరు సిద్దులు, మైలారం శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, షాపురం దర్శన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ఏర్పాట్లపై నోడల్ అధికారులు అవగాహన కలిగి వుండాలి

## -ఎన్నికల సాధారణ పరిశీలకులు జి.రవి

**వికారాబాద్, జనవరి 28, ప్రభాతవార్త :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి వుండాలని ఎన్నికల సాదారణ పరిశీలకులు జి.రవి అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జనరల్ అబ్జర్వర్ రవి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లతో కలిసి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాదారణ ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ, ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినందున ఎన్నికల నియమ నిభందనలు పాటించాలని, విధుల పట్ల నిబద్ధతతో పనిచేయాలని, జిల్లాలో వికారాబాద్, కోడంగల్, పరిగి, తాండూర్ నాలుగు మున్సిపాలిటీ లలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించ బడునని తెలిపారు.ఎన్నికల నియమాల ను ఖచ్చితంగా పాటించాలని, పట్టణ పరిధిలో ఎన్నికల నియమావళిని అ నుసరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల విధులు ఎంతో కీలకమైనవని, ఎక్కడ ఎలాంటి పొరపాటు జరగకుండా అన్ని జాగ్రత్తలతో సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప నులు ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల మేరకు పూర్తి చేయాలన్నారు. అన్ని సెషన్లకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలింగ్ రోజు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు పకడ్బందీగా చేయాలన్నారు. ఎన్నికల సిబ్బందిని గుర్తించి, శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. విధులు కేటాయించిన నోడల్ అధికారులు విధుల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని




సమావేశంలో మాట్లాడుతున్న సాధారణ ఎన్నికల పరిశీలకులు

ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున నోడల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తూ క్షేత్రస్థాయి నుంచి పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధులలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా, తమకు కేటాయించిన విధుల ను ఎలాంటి తప్పిదాలకు తావు ఇవ్వ కుండ నిర్వర్తించాలని సూచించారు. నోడల్ అధికారులందరు తమ విధుల ను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుదీర్,డిపిఓ జయసుధ, డిఇఓ రేణుకా దేవి, పిడి మెప్మా వెంకటనారాయణ, సీపీఓ వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ అధికారి మాధవరెడ్డి, ఆర్‌టిఏ వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# రవాణాశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**వికారాబాద్, జనవరి 28, ప్రభాతవార్త :** జిల్లా రవాణా శాఖ అధికారి పి.వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో వికారాబాద్ మండలం నారాయణపూర్ గ్రామంలో మహావీర్ ఆసుపత్రి వైద్యులు మెగా వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని వివిధ స్కూల్లకు సంబంధించిన స్కూల్ బస్సు డ్రైవర్ల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా రవాణాశాఖ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం..ఆరోగ్యం మనకు సహకరించినప్పుడు ఏ పనైనా చేయగలమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని, ముఖ్యంగా స్కూల్ బస్సు నడిపేవారు విద్యార్థుల ను వారి గమ్య స్థానాలకు సురక్షితంగా చేర్చాలని సూచించారు. రోడ్డు నియమ నిబంధనల ను పాటించాలని వివరించారు. ఆర్టిఏ మేంబర్ ఎర్రవల్లి జాఫర్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ



వైద్య శిబిరంలో పాల్గొన్న జిల్లా రవాణాశాఖ అధికారి వెంకట్‌రెడ్డి

రహదారి నియమాలు పాటించి భవిష్యత్తు ను బంగారుమయం చేసుకోవాలని తెలిపారు. మహావీర్ హాస్పిటల్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ గురురాజ్ వాలి ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో వైద్య బృందంచే డ్రైవర్లకు హెల్త్ చెకప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్, ఏఎంవీఐ వరుణ్ కుమార్, ఆర్టీఏ సిబ్బంది పాల్గొన్నారు.

# మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**దుద్యాల్, జనవరి 28, ప్రభాతవార్త :** కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి, మండల అధ్యక్షుడు అవుటి శేఖర్ లు పేర్కొన్నారు. బుధవారం దుద్యాల్ మండల కేంద్రంలో రూ.30 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి, రూ.30 లక్షలతో 60 వేల లీటర్ల నీటి సామర్థ్యం కల్గిన తాగునీటి ట్యాంకు, మండల పరిధిలోని సత్తర్ కుంట తండా గ్రామ పంచాయతీ అ ను బంధ గ్రామమైన పీర్లగడ్డ తండాలలో రూ. 14.5 లక్షలతో 20 వేల లీటర్ల సామర్థ్యం గల తాగునీటి ట్యాంకు నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాలైన, పల్లెలైన, తండాలైన సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం అని అన్నారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఇతర సంక్షేమ ఫలాలు అందిస్తున్నమన్నారు. అదే కాకుండా ప్రతి గ్రామానికి గ్రామ పంచాయతీకి భవనాలు మంజూరు చేస్తున్నామన్నారు. దుద్యాల్ లో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనానికి మరో రూ. 40 లక్షలు కేటాయిస్తామని అధికారులు తెలిపారు. గిరిజన తండాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ రవి కుమార్, డీఈ శశాంక్, ఏఈ రాఘవెందర్, పంచాయత్ రాజ్ ఏఈ సురెందర్ రెడ్డి, తహసీల్దార్ కిషన్,



డీడీఎల్‌పి1: అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేస్తున్న నాయకులు

ఎంపీడీవో జైపాల్ రెడ్డి, ఎంపీవో సత్యనారాయణ, ఉపాధిహామి పథకం స్టేట్ కౌన్సిల్ మెంబర్ నర్సిములు గౌడ్, కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్, వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య, దుద్యాల్ గ్రామ సర్పంచ్ సంగీత వివిధ గ్రామాల సర్పంచ్ లు పూజ, నరేశ్, నాయకులు శ్రీశైలం గౌడ్, ఖాజ, సంజీవ్ కుమార్, రాజు నాయక్, రవీందర్ నాయక్. శివరాం నాయక్, సత్యనారాయణ, రమేశ్ రాథోడ్, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**ధారూరు, జనవరి 28, ప్రభాతవార్త :** చదువు అనేది ఒక ఆయుధం లాంటిదని, విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమవుతుందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. బుధవారం ధారూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన ఆకస్మికంగాతనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలల్లో విద్యాబోధన తీరుతె న్నుల ను అడిగి తెలుసుకున్నారు.కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి జవాబుదారీతనంతో పని చేయాలని సూచించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, ఎపిజె అబ్దుల్ కలాం వంటి మహనీయుల జీవితాల ను స్ఫూర్తిగా తీసుకుని, విద్యార్థులకు విద్యఆవశ్యకత ను వివరించాలని కోరారు. ముఖ్యంగా ఆంగ్ల భాషపై విద్యార్థులు పట్టు సాధించేలా, వారికి సరళంగా అర్థమయ్యే రీతిలో బోధించాలని, చదవడం, రాయడంతో పాటు ఆంగ్ల పదాల అర్థాల ను గ్రహించేలా తర్ఫీదు ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి వారిలో ఆత్మవిశ్వాసం నింపేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులు ఒక కుటుంబ పెద్దగా



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

వ్యవహరిస్తూ, ఉపాధ్యాయులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో పారిశుధ్యానికి పెద్దపీట వేయాలని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న మరమ్మత్తు ప నుల ను త్వరగా పూర్తి చేస్తామని, భవనాలకు వేసే పెయింటింగ్ నాణ్యంగా, ఎక్కువ కాలం మన్నేలా ఉండాలని అధికారుల ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా దేవి, మండల

# కృషికి దక్కిన గౌరవం



ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేత మామిడి సిద్ధార్థ రెడ్డి,తదితరులు

## - ఎమ్మెల్యే శంకర్‌కు కీలక బాధ్యతలు -హర్షం వ్యక్తం చేసిన నేతలు

**కొత్తూర్, జనవరి 28, ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్‌గా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎంపిక కావడంతో కొత్తూరు మండలం పెంజర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మామిడి సిద్ధార్థ రెడ్డి స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే శంకర్ తన అద్భుతమైన సామర్థ్యానికి, అంకితభావానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన తగిన గుర్తింపేనని అన్నారు. అట్టడుగు స్థాయి నుంచి అనేక అవమానాలు, ఆటంకాలు ఎదుర్కొంటూ నిరంతర కృషితో రాజకీయాల్లో ఎదిగిన నాయకుడు శంకరన్న అని ప్రశంసించారు. ఒక సాధారణ కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించి, ఎమ్మెల్యేగా ఎదిగి, ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం ఆయన పోరాట పయనానికి నిదర్శనమని అన్నారు. శంకర్ నియామకంతో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానుల్లో ఉత్సాహం వెల్లివిరుస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాంతన్ రెడ్డి, నాయకులు లచ్చిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రం దివాలా తీసింది

## మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, జనవరి 28. ప్రభాతవార్త :** రాష్ట్రాన్ని దివాళా తీయించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. ఎల్లంపేట మున్సిపాలిటీలోని ఎల్లంపేట, లింగాపూర్ గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించి గ్రామాల్లో నిర్వహించిన పార్టీ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ధనిక రాష్ట్రాన్ని దివాలా తీయించి దరిద్రంగా మార్చారని తెలిపారు. ఒక్కరు కూడ ప్రజల వద్దకు వచ్చిన నాయకుడు లేడని, అతలాకుతలం చేసి జనాలను ఆగం చేశారని ఆరోపించారు.మంచి నీరు లేక, కరంట్ రాక,



లింగాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

వ్యాపారం సాగక, రియల్ ఎస్టేట్ కొనసాగకా ఆర్థికంగా అందరూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనే బాగుందని, కెసీఆర్ మాకు కావాలని గ్రామాల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు మద్దతు పలుకుతున్నారని చెప్పా రు. మున్సిపల్ ఎన్నికల్లో మూడు మున్సిపాలిటీలో విజ యం బీఆర్ఎస్‌దేనని అన్నారు.ఈ కార్య క్రమంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గపార్టీ ఇంచార్జ్ లక్ష్మారెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ మహేందర్‌రెడ్డి, మేడ్చల్ మున్సి పల్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, నాయకుశ్రీనివాస్‌రెడ్డి, రాజమల్లారెడ్డి, లక్ష్మీ, సంజీవ, దర్శన్ పాల్గొన్నారు.

# ప్రతిపల్లె నాసొంత ఊరే..!

## పంచాయతీ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కార్యకర్తలకు దిశా నిర్దేశం

**నందిగామ, జనవరి 28, ప్రభాతవార్త:** గత పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ శిలాఫలకాలతోనే సరిపెట్టుకుందని,కాంగ్రెస్ గెలిచిన రెండేళ్ల కాలంలో అభివృద్ధి,సంక్షేమ పథకాలు ప్రజల గడపకు చేర్చి ప్రజల విశ్వాసాన్ని కూడగట్టుకొని ప్రగతి వైపు అడుగులు వేస్తున్నామని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. బుధవారం నందిగామ మండలం అప్పారెడ్డి గూడ గ్రామంలో ఎస్డిఎఫ్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పల్లె నా సొంత ఊరే.. వచ్చే మూడేళ్ల కాలంలో నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానని చెప్పారు. గతపాలకులు పంచాయతీలను పటించుకోకపోవడంతో ప్రగతికి నోచుకోలేదని ధ్వజమెత్తారు. ఇచ్చిన మాట అస్తవ్యస్తమైన రహదారులను బాగు చేస్తున్నామన్నారు. మహిళా సమాఖ్య భవనానికి, గ్రామపంచాయతీ నిర్మాణ భవనానికి స్థలం కేటాయించిన దాతలు, కీర్తిశేషులు సరోజనమ్మ దేవి, కీర్తిశేషులు రాందేవ్ రెడ్డి పుణ్యమూర్తులను స్మరించారు. వారు ఎక్కడున్నా వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుకుంటున్నాను అన్నారు. మీ బిడ్డగా మీ




అప్పారెడ్డి గూడలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అందరి ఆశీర్వాదంతోనే గెలిచానని, నిధులు తెస్తా నియోజకవర్గంలో రూపురేఖలు మారుస్తానని భరోసా ఇచ్చారు. ఈ వేడుకల్లో ఇంచార్జ్ ఎంపీఓ చక్రధర్ గౌడ్ ,సర్పంచ్ చిన్నంతర గారి మల్లేష్, ఉపసర్పంచ్ లు ప్రభు, ఎర్ర వెంకటేష్ గౌడ్, ఆవుల మంద శివశంకర్, పంచాయతీ కార్యదర్శి నరేష్ ,కాంగ్రెస్ నేతలు రవీందర్ రెడ్డి లక్ష్మారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, నాయకులు పసుల బుచ్చయ్య, నవాజి రెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, భగవాన్ దాస్, మాణిక్యం, సీతారాం, ఎం ప్రభాకర్ ,సట్టి వెంకట్ ,ప్రభాకర్ రెడ్డి, సురేష్ ,సిద్దాపూర్ శేఖర్ రెడ్డి, చిన్నంతర గారి కృష్ణ, ఆటో కృష్ణ, గడ్డం జగ్గయ్య, చీకుర్తి సుదర్శన్ ,బాలరాజ్, శివగళ్ల ప్రవీణ్ , శివగళ్ళ సురేష్ , అగ్గి ప్రవీణ్ , జ్ఞానేశ్వర్, మండల ఎస్టి సెల్ అధ్యక్షుడు పాతులావత్ శ్రీను నాయక్, సుక్యానాయక్, కావలి భీమయ్య, రూప్ సింగ్, మహిళా సమాఖ్య సంఘం సభ్యులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం మరువలేనిది

## ఎమ్మెల్యేను సన్మానించి కృతజ్ఞతలు తెలిపిన నటుడు టార్జాన్

**నందిగామ, జనవరి 28, ప్రభాతవార్త:** షాద్ నగర్ నియోజకవర్గ ప్రాంత కళాకారుల ఉన్నతి కోసం కృషి చేస్తూ వారి సౌజన్యం కోసం ఆడిటోరియం నిర్మాణానికి ప్రభుత్వం ద్వార సుమారు నాలుగున్నర కోట్ల రూపాయలు మంజూరు చేయించడం శుభ పరిణామం అని టాలీవుడ్ ప్రముఖ సినీ నటుడు టార్జాన్ (లక్ష్మీ మ్మనారాయణ) అన్నారు. బుధవారం నందిగామ మండలం అప్పారెడ్డి గూడ గ్రామంలో గ్రామపంచాయతీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఒకే అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను కలిసి సన్మానించారు. షాద్ నగర్ లో నూతన ఆడిటోరియం నిర్మాణం కోసం ప్రభుత్వం ద్వార ఎమ్మెల్యే శంకర్ 4.38 కోట్ల రూపాయలు మంజూరు చేయడం పట్ల నటుడు టార్జాన్ ఎమ్మెల్యేను ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపికను బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ కృషికి ఆయన కళాకారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కళాకారులను అర్థం చేసుకొని వారి మనోభావాలకు అనుగుణంగా అర్థంతరంగా ఆగిపోయిన కళాక్షేత్రాన్ని



తిరిగి రూపుదిద్దుకునేలా చేసిన కృషి అనిర్వచనం అన్నారు. కళాకారుల సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఎమ్మెల్యే శంకర్ వెంట ఉంటాయని భగవంతుడి దయవల్ల మంచి ఆరోగ్యం సుదీర్ఘ సుపరిపాలన అందే విధంగా కృషి చేయాలని ఆకాంక్షి ంచారు. ఈ సంద ర్భంగా ఆయన తోపాటు స్థానిక జర్నలిస్టు కె.పి, హరీష్ కుమార్ శర్మ తదితరులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా సన్మానించారు. కళాకారులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



కాడ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్నబాధితులు

# రోడ్డు వెడల్పు 30 ఫీట్లకు ఎక్కువ పెంచొద్దు

**దుద్యాల్, జనవరి 28, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు 30 ఫీట్ల కంటే ఎక్కువగా పెంచవద్దని రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోతున్న బాధితులు కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందించారు. రోడ్డు వెడల్పు 30 ఫీట్ల కంటే ఎక్కువగా పొడిగించడం వల్ల 120 ఇండ్లు, ఖాళీ స్థలాలు కోల్పోతామని సుమారు 200 కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రార్థన మందిరాలు సైతం కట్ అయ్యే అవకాశం ఉందని దుద్యాల గ్రామంలో రోడ్డు ను 30 ఫీట్లకే పరిమితం చేయాలని కోరారు.

# గ్రామాభివృద్ధికి మొదటి ప్రాధాన్యత

## పోతుగల్ గ్రామ సర్పంచ్ పామెన నర్సింలు

**షాబాద్, జనవరి 28, ప్రభాతవార్త :** గ్రామంలోని సమస్యలు పరిష్కరించి, గ్రామాభివృద్ధి మొదటి లక్ష్యంగా పనిచేస్తున్నామని పోతుగల్ గ్రామ సర్పంచ్ పామన నర్సింలు అన్నారు. షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు గిరిజన తండాలో బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముఖరం షరీఫ్ ఆర్థిక సహాయం ద్వారా మూడు బోరు బావులు వేయించి, మోటార్ బిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో గ్రామస్తులు సహకరించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నేరెట్ల సావిత్రి, గ్రామ కార్యదర్శి అశోక్, వార్డు సభ్యులు కేశవల్లి కరుణాకర్ రెడ్డి, మూడవత్ గోపాల్, కుమ్మరి చంద్రశేఖర్, విస్లావత్ తారాసింగ్, గ్రామ పెద్దలు పీరంపల్లి యాదయ్య, కావలి శ్రీనివాస్, కేతావత్ బాల్య నాయక్, కేతావత్ కిషన్ నాయక్, సయ్యద్ మోసిన్, సయ్యద్ ఆసిఫ్ అలీ, సయ్యద్ నవాజ్, పామెన రాజు, నేరెట్ల నరేందర్, కామారెడ్డి విజయ్ కుమార్, కేతావత్ సంజు ప్రసాద్ నాయక్, కేతావత్ నాగేష్, నాగరకుంట మహేందర్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మీరాపూర్ దర్గా ఉత్సవాలకు సర్వం సిద్ధం

**షాబాద్, జనవరి 28, ప్రభాతవార్త :** ఫిబ్రవరి 5 నుండి 6 వరకు షాబాద్ మండల పరిధిలోని మీరాపూర్ దర్గా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు చెన్నాబాయి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 5, 6 తేదీల్లో దర్గా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం కవాలి జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాలకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని, ఈ ప్రత్యేక ప్రార్థనల్లో పలువురు రాజకీయ నాయకులు, పాల్గొంటూ ఉన్నారని అన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న పావనిజంగయ్యయాదవ్

**ఘట్‌కేసర్, జనవరి 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ దంపతులు తిరుమలలో శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి పర్యటనలో భాగంగా ఆమె కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని సుప్రభాతసేవలో పాల్గొన్నారు. అనంతరం పలు ఆలయాలు సందర్శించి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.